క్లుప్తంగా

జానపద కళలను ఆదరించాలి

ఎమ్మిగనూరుటౌన్: జానపద కళలను ఆదరించాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. నీలకంటేశ్వర స్వామి రథోత్సవం, జాతర సందర్భంగా పట్టణంలో ఆదివారం రాత్రి నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఎర్రకోట జగన్ యూత్ నాయకులు సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో రేలారే రేలా, జానపద సంగీత విభావరి నిర్వహించారు. ప్రముఖ జానపద కళాకారులైన సునీత జంగిరెడ్డి, శివనాగులు, బేతంచర్ల గోపాల్‌తో పాటు తూర్పు గోదావరి జిల్లా కళాకారులు ప్రదర్శించిన జానపద ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాకారులను ఎమ్మెల్యే సన్మానించారు. మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో ఆదివారం రాత్రి నీలకంఠేశ్వర స్వామి నాటక కళా సమితి ఆధ్వర్యంలో మయసభ, శ్రీకృష్ణ రాయభారం, భవాని సీను తదితర నాటక ప్రదర్శనలను ఎమ్మెల్యే తిలకించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు రిటైర్డ్ ఎంఈఓ రాజరత్నం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

10న వాహనాల వేలం

ఆలూరు రూరల్: అక్రమ మద్యం, నాటు సారా తరలిస్తూ పట్టుపడిన వాహనాలను ఈ నెల 10వ తేదీ స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో వేలం వేయనున్నట్లు ఆలూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఎర్ర వెంకట్ ఆదివారం వెల్లడించారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, సెబ్ అడిషనల్ ఎస్పీ శ్రీకాంత్ పటేల్ ఆదేశాల మేరకు 83 వాహనాలను వేలం వేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు రూ.5 వేలు నగదు చెల్లించి టోకెన్ తీసుకుని వేలం పాటకు హాజరుకావాలని చెప్పారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి వేలం నిర్వహించనున్నట్లు సీఐ తెలిపారు.

11న ముగ్గుల పోటీలు

హొళగుంద: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎస్ఎస్‌వీ ఆధ్వర్యంలో ఈ నెల 11న ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు గిరి, మరిమల్ల ఆదివారం తెలిపారు. స్థానిక సిద్దేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ముగ్గుల పోటీలు ఉంటాయని, ఆసక్తి గల మహిళలు పాల్గొనాలని కోరారు. పోటీల్లో విజేతలకు దాతల సహకారంతో మొదటి బహుమతి రూ.5 వేలు, రెండో బహుమతి రూ.3 వేలు, మూడో బహుమతి రూ.2 వేలు అందిచనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల మహిళలు సొంతగా రంగులు తెచ్చుకుని పోటీలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు 96660 30835 నంబర్‌ను సంప్రదించాలన్నారు. యూత్ సభ్యులు పెద్యాట మల్లయ్య, షాలీ షబ్బీర్ ఉన్నారు.

13 నుంచి కబడ్డీ పోటీలు

ఆస్పరి: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఆస్పరి యూత్ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు రామకృష్ణ, మహేశ్ తదితరులు ఆదివారం విలేకురులకు తెలిపారు. పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.20,116 (చిప్పగిరి జెడ్పీటీసీ విరుపాక్షి), రన్నర్ జట్టుకు రూ.10,116 (ఆర్‌ఆర్ ఫార్మసీ యజమానులు), మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5,116 (మేకల రంగనాథ్) అందిస్తారన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 11వ తేదీ లోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరును నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 99129 51780, 77020 57770 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు

డీటీఎఫ్ డైరీ ఆవిష్కరణ



డీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని వీవర్స్ కాలనీ హైస్కూల్‌లో ఆదివారం డీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నరాజు ఆవిష్కరించారు. ఎస్టీయూ నాయకులు నాగరాజు, బసవరాజు, వెంకటేశ్వర్లు, బాబయ్య, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి శవాసప్ప తాత ఉరుసు

తుగ్గలి: మండల పరిధిలోని చెన్నంపల్లిలో ఈనెల 20 నుంచి మూడు రోజుల పాటు శవాసప్ప తాత ఉరుసు నిర్వహించనున్నట్లు దర్గా నిర్వాహకులు, గ్రామస్తులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 20న గంధం, 21న ఉరుసు, 22న జియారత్ కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

ఈ-కేవైసీకి 15వ తేదీ వరకు గడువు

తుగ్గలి: పీఎం కిసాన్ లబ్ధిదారులు ఈ నెల 15వ తేదీలోపు ఈ-కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ మండల అధికారి పవన్‌కుమార్ ఆదివారం తెలిపారు. మండలంలో మొత్తం 16,548 మంది రైతులు పథకానికి అర్హులుగా ఉండగా వారిలో ఇప్పటివరకు 12,681 మంది మాత్రమే ఈ-కేవైసీ నమోదు చేసుకున్నట్లు చెప్పారు. మిగతా 3,867 మంది రైతులు ఈ-కేవైసీ చేసుకోవాల్సి ఉందన్నారు. సదరు రైతులు ఆర్‌బీకేల్లో లేదా వ్యవసాయ కార్యాలయంలో ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేసుకున్న వారికి మాత్రమే పీఎం కిసాన్ నగదు జమ అవుతుందని తెలిపారు.

రమణీయం.. నీలకంఠేశ్వరుడి రథోత్సవం



హోమపూజల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరు/టౌన్/రూరల్: ఎమ్మిగనూరు ప్రజల ఆరాధ్య దైవం శ్రీ నీలకంఠశ్వర స్వామి మహా రథోత్సవం లక్షలాది మంది భక్తజనుల జేజేలు మధ్య ఆదివారం సాయంత్రం 6.13 గంటల నుంచి 6.58 గంటల వరకు కనులపండువగా సాగింది. ముందుగా స్వామి వారి ఆలయంలో శ్రీ నీలకంఠుడికి విశిష్ట పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్వామివారి ఉత్సవ ప్రతిమను ఊరేగింపుగా తీసుకొచ్చి తేరుబజార్‌లో పీఠంపై ఆశీనులు చేసి హోమం నిర్వహించారు. పూర్ణకుంభంతో స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. చివరిగా స్వామి వారిని మహారథంపై ఆశీనులు చేసి రథోత్సవాన్ని శ్రీ మార్కండేయ స్వామి ఆలయం వరకు లాగి తిరిగి యథాస్థానానికి తీసుకొచ్చారు. స్వామివారిని మహారథంపై ఊరేగింపు నిర్వహించిన తీరు భక్తజనులను తన్మయానికి గురిచేసింది. రథోత్సవాన్ని తిలకించేందుకు దాదాపు 2 లక్షలపైగా భక్తులు తరలివచ్చినట్లు అంచనా.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ఆదివారం ఉదయం స్వామి ఆలయంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త మాచాని నాగరాజు నీలమురళీధర్, శివశంకర్ తదితరులు సాంప్రదాయకంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. నీలకంఠేశ్వర స్వామి కృపతో నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

రథోత్సవంలో ప్రముఖులు

రథోత్సవాన్ని తిలకించేందుకు నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, సీతారామిరెడ్డి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జ్ తిక్కారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ జయన్న, ఈఓ దినేష్‌చౌదరి, పారిశ్రామిక వేత్తలు మాచాని సోమనాథ్, ఆదిత్య, ధర్మకర్త మాచాని నీల మురళీధర్, పురుషోత్తం రెడ్డి, మున్సిపల్‌కమిషనర్ గంగిరెడ్డి, ఆలయ ధర్మకర్త మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ సిద్ధార్థ్‌కౌశల్ నేతృత్వంలో ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో పట్టణ, రూరల్ సీఐలు మధుసూదన్, మంజునాథ్ 400 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.



ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, సీతారామిరెడ్డి



చిన్నారుల కోలాటం సందడి



మహారథానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నేటి నుంచి మద్దికెరలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెరలో సోమవారం నుంచి 11వ తేదీ వరకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ దేవిరెడ్డి మురళీధర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. 9, 10 తేదీల్లో గ్రామంలో సాయంత్రం 3 గంటల నుంచి, అలాగే 11వతేదీ ఉదయం 7:30 గంటల నుంచి సాయంత్రం వరకు కార్యక్రమం ఉంటుందని వివరించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయో? లేదోనని ప్రజలను అడిగి తెలుసుకుంటారన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, వలంటీర్లు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

ప్రారంభమైన వలసలు

కృష్ణగిరి: మండలంలో ఉపాధి పనులు సక్రమంగా కల్పించకపోవడంతో కూలీలు వలస బాటపట్టారు. ఆదివారం మండల పరిధిలోని పెనుమాడ తదితర గ్రామాల్లో దాదాపు 40 కుటుంబాలు గుంటూరుకు ఆటోల్లో వలస వెళ్లారు. గ్రామాల్లో అధికారులు పనులు కల్పించకపోవడంతో అప్పులు తీర్చడం, కడుపు నింపుకునేందుకు వలస వెళుతున్నట్లు కూలీలు బాలమద్దయ్య తదితరులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఏపీఓ అబ్దుల్‌షుకూర్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పనుల కోసం డిమాండ్ పెట్టాలని ఆయా గ్రామాల సీనియర్ మేట్‌లను ఆదేశించాం. రెండు మూడు రోజుల్లో కూలీలందరికీ పనులు కల్పిస్తాం. తొందరపడి వలస వెళ్లి ఇబ్బందులు పడవద్దని సూచించారు.

శివదీక్ష స్వీకరణ

గోనెగండ్ల: స్థానిక ఈశ్వర దేవాలయంలో మండల (41 రోజులు) శివదీక్షా కార్యక్రమం ఆదివారం శివభక్తుల మధ్య కనుల పండుగగా జరిగింది. దీక్ష మాలధారణ కార్యక్రమం వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్య స్వామి ఆధ్వర్యంలో సాగింది. మండల దీక్ష స్వీకరించే వందలాది మంది భక్తులు ఉదయమే భక్తిశ్రద్ధలతో స్నానమాచరించి మాలధారణ చేశారు. శివరాత్రి రోజున శ్రీశైలంలో దీక్షను విరమిస్తారని ఆయన తెలిపారు. ఫిబ్రవరిలో అర్ధ మండల దీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఏకభుక్తం, గోధుమ రంగు వస్త్రధారణ, త్రిసంధ్యల్లో పంచాక్షరీ మంత్ర జపం చేయాలని, అలాగే శివ స్వాములు దీక్ష కాలంలో ఎలాంటి నియమాలు పాటించాలో వివరించారు. భక్తుల శివనామస్మరణతో ఆ ప్రాంతం మారుమ్రోగింది.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: నిరుపేదలకు సేవలందించడంలో స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. స్థానిక మంత్రి నివాసంలో ఆదివారం రెన్యూ పవర్ కంపెనీ ప్రతినిధుల సహకారంతో నియోజకవర్గ కేంద్రంలో బుడగ జంగాలు, వ్యవసాయ కార్మిక కూలీలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రైవేటు పరిశ్రమల నిర్వాహకులు తమ ఆదాయంలో కొంత మొత్తాన్ని పేదలకు సేవలందించేందుకు వెచ్చించాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, వీరేష్, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఎఫ్‌ఎం లెవెన్ జట్టు



విజేత ఎఫ్‌ఎం లెవెన్ హోస్పేట్ జట్టుకు రూ.2 లక్షల నగదు, ట్రోఫీ అందజేస్తున్న ఎర్రకోట జగన్

ఎమ్మిగనూరుటౌన్: శ్రీ నీలకంఠేశ్వర స్వామి మహా రథోత్సవం సందర్భంగా పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ మైదానంలో గత 40 రోజులుగా జరిగిన వైఎస్సార్ అంతర్ రాష్ట్ర ఛాలెంజర్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. ఎఫ్‌ఎం లెవెన్ హోస్పేట్ జట్టు, రెడ్ బ్యాక్ రైచూర్ జట్ల మధ్య ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో ఎఫ్‌ఎం జట్టు విజేతగా నిలిచింది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతగా నిలిచిన ఎఫ్‌ఎం జట్టుకు నగదు బహుమతి రూ.2 లక్షలతో పాటు ఆరడుగుల ట్రోఫీని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, భీమిరెడ్డి, యూకే రాజశేఖర్ అందించారు. రన్నర్‌గా నిలిచిన రెడ్‌బ్యాక్ రైచూరు జట్టుకు రూ.లక్ష నగదుతో పాటు ట్రోఫీని అందించారు. టోర్నమెంట్‌లో వివిధ ప్రాంతాల నుంచి 135కు పైగా జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్ తిలకించేందుకు వందలాది మంది క్రీడాభిమానులు తరలివచ్చారు. ఆర్గనైజర్లు సయ్యద్‌హామద్, తిరుమల్, తదితరులు పాల్గొన్నారు.

విజేత నలంద జట్టు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా నిర్వహించిన వివిధ ప్రభుత్వ శాఖల అఫీషియల్ క్రికెట్ టోర్నీ విన్నర్‌గా స్థానిక నలంద విద్యాసంస్థల జట్టు గెలుపొందింది. రన్నర్‌గా ఎల్లెల్సీ ఇరిగేషన్ జట్టు నిలిచింది. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా జట్లకు ట్రోఫీలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారు. అదేవిధంగా కళాశాల విద్యార్థుల టోర్నీలో గోనెగండ్ల డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని అందుకుంది.

13న కుంభోత్సవం

హొళగుంద: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో వెలసిన దుర్గమ్మ దేవి ఆలయంలో ఈ నెల 13న మేటి కుంభోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు ఆదివారం విలేకరులకు తెలిపారు. గ్రామ శివారున వెలసిన అమ్మవారి ఆలయంలో 12న గంగిపూజ, 13న మేటి కుంభోత్సవ ఊరేగింపు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

ఎమ్మిగనూరుటౌన్: క్రీడల్లో పాల్గొనడం ద్వారా క్రీడాకారుల్లో నైపుణ్యం పెరుగుతుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీనీలకంఠేశ్వర స్వామి మహారథోత్సవం సందర్భంగా పట్టణంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో ఆర్గనైజర్లు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, విశ్వనాథ్ రమేష్‌లు నిర్వహణలో వైఎస్సార్ అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలు జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదట జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు స్నేహభావంతో ఆడాలని గెలుపోటములు సమానంగా తీసుకోవాలని సూచించారు. క్రీడాపోటీల నిర్వహణకు సహకరించిన పట్టణ ప్రముఖులు, నాయకులను మొమెంటోలు, శాలువాలతో సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టారంగయ్య, రియాజ్‌అహమ్మద్, యుకే రాజశేఖర్, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఖాదర్ బాషా

ఆలూరు రూరల్: స్కూటర్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో కొరియర్ బాయ్ ఖాసీం బాషాకు తీవ్రగాయాలయ్యాయి. హైవే-167లోని ఆలూరు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. వివరాలు.. ఆలూరుకు చెందిన ఖాదర్ బాషా ఓ కొరియర్ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. వృత్తిలో భాగంగా ఆదివారం ఉదయం హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి పార్సిల్ ఇవ్వడానికి స్కూటర్‌పై వెళ్తుండగా ఆలూరు సమీపంలోని మారెమ్మ ఆలయం వద్ద ట్రాక్టర్ (ఏపీ 21 టీజెడ్ 7618) పొలాల రస్తా నుంచి మట్టి లోడుతో హైవే పైకి వస్తూ స్కూటర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ఖాసీం బాషా తలకు తీవ్రగాయాలయ్యాయి. అక్కడున్నవారు క్షతగాత్రుడిని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం బళ్లారి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

స్త్రీనిధి చెల్లింపుల్లో గోల్‌మాల్ ?

వెల్దుర్తి: మండల కేంద్రంలో పొదుపు మహిళలు తీసుకున్న స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లో రూ.లక్షలు గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు సంబంధించి బాధిత గ్రూపు మహిళలు ఆదివారం విలేకరులకు పలు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని 14వ వార్డులో ఇలాహి, ఇంద్ర ధనస్సు, మనీషా, మల్లీశ్వరి, భాను, ఖాజాబీ, లావణ్య, అల్లాహు తదితర పేర్లతో పొదుపు సంఘాలు ఉన్నాయి. ఆ సంఘాల్లోని మహిళలు తీసుకున్న స్త్రీనిధి రుణాలను కొందరు పూర్తిగా చెల్లించారు. మరికొందరు నెలవారీగా కంతులు చెల్లిస్తున్నారు. 24 కంతులు పూర్తిగా చెల్లించిన వారిలో ఇలాహి గ్రూపు మహిళల రుణం ఇంకా రూ.లక్ష చెల్లించాల్సి ఉన్నట్లు, ఇంద్ర ధనస్సు గ్రూపు మహిళల రుణం రూ.71 వేలు, మనీషా గ్రూపు వారి రుణం రూ.76 వేలు ఇలా పలు గ్రూపుల రుణాలకు సంబంధించి మొత్తం కట్టినా ఇంకా నగదు చెల్లించాల్సి ఉన్నట్లు రికార్డులు చూపుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్త్రీనిధి రుణం 10 మంది గల ఒక గ్రూపులో నలుగురు మహిళలకు రూ.50 వేల చొప్పున అందిస్తుంది. వీరు 24 కంతులలో తంచనుగా కట్టేయగా ఆఖరి కంతు కట్టాల్సిన అవసరం ఉండదు. ఈ చెల్లింపులను నగదు రూపంలో గ్రూపు మహిళలు బుక్ కీపర్లకు అందిస్తారు. చెల్లింపు చేసినట్లు చిన్న బుక్‌లో వివరాలు రాసుకుంటారు. బుక్ కీపర్లు సీసీల ద్వారా సంబంధిత అకౌంట్‌కు జమ చేస్తారు. ఆరోపిస్తున్న వారి గ్రూప్ మహిళల వద్ద తాము చెల్లింపు చేసినట్లు ఆధారాలున్నాయని, అయితే ఆయా స్త్రీనిధి అకౌంట్‌లో మాత్రం జమ కాలేదని రికార్డులు చూపుతున్నట్లు చెబుతున్నారు. దీంతో బుక్ కీపర్లు, సీసీల చేతివాటంపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. విచారించి వెంటనే న్యాయం చేయాలని బాధిత మహిళలు అధికారులను కోరుతున్నారు.

రోడ్డును బాగు చేయాలి

హొళగుంద: పొలాలు, హొన్నూరు క్యాంపు వరకున్న తెక్కలకోట రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని హొళగుంద రైతులు కోరుతున్నారు. వాస్తవంగా ఈ రోడ్డు హొళగుంద నుంచి కర్ణాటకలోని తెక్కలకోట గ్రామం వరకు ఉండగా పూర్వీకులు తిరిగే వారు. ప్రస్తుతం వాల్మీకి సర్కిల్ నుంచి మొదలై హొన్నూరు కొట్టాల, హొన్నూరు తదితర గ్రామాల మీదుగా వెళ్తుంది. అయితే ప్రధానదారులు ఉండడంతో పాత రోడ్డు ఆక్రమణకు గురై కనుమరుగయ్యే అవకాశాలున్నాయని, దీంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. హొళగుందలోని అయ్యప్ప కాలనీ వాసులు కూడా రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి బాగు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్రీడలతో స్నేహసంబంధాలు



విజేత పోలీసు జట్టుకు కప్ అందజేస్తున్న జడ్జి దివ్య

పత్తికొండ రూరల్: క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగుపడతాయని జూనియర్ సివిల్ జడ్జి దివ్య అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జర్నలిస్టుల ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో పోలీసు జట్టు విజేతగా గెలుపొందగా, రన్నర్స్‌గా జర్నలిస్టు జట్టు నిలిచింది. జర్నలిస్టులు, న్యాయవాదుల మధ్య జరిగిన పోటీలో జర్నలిస్టులు గెలవగా, మెడికల్, పోలీసు డిపార్ట్‌మెంట్ల మధ్య జరిగిన పోటీలో పోలీసు జట్టు గెలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో జర్నలిస్టులు, పోలీసుల తలపడగా మ్యాచ్ రసవత్తరంగా సాగింది. విజేతగా నిలిచిన పోలీసు జట్టుకు మెజిస్ట్రేట్ దివ్య కప్ అందజేశారు. సీఐ రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా రన్నర్స్ జట్టుకు బహుమతి అందించారు. న్యాయవాదులు, మెడికల్ సిబ్బంది డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రఘురామిరెడ్డి, డాక్టర్ కల్పన చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. న్యాయవాద సంఘం అధ్యక్షుడు మల్లికార్జున, మాజీ అధ్యక్షుడు ఆవుల మైరాముడు, నిర్వాహకులు రాజేష్‌గౌడ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం.. జ్ఞాపకాలు మధురం



వెల్దుర్తిలో గురువుల ఫొటోలతో కూడిన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం



అలనాటి ఉపాధ్యాయులతో మద్దికెర జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

వెల్దుర్తి: స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రారంభమయ్యాక మొట్టమొదటి ఎస్ఎస్ఎల్‌సీ బ్యాచ్ - 1958 నుంచి గతేడాది బ్యాచ్ వరకు పూర్వ విద్యార్థులందరినీ ఏకం చేయడం, సేవా దృక్పథంతో సాగడం, విద్యార్థులను ప్రోత్సహించడం, స్కూల్ బాగోగులు చూసుకోవడమే తమ లక్ష్యమని హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, విద్యావేత్త వావిలాల కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బాలికల హైస్కూల్‌లో వెల్దుర్తి జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆద్యంతం ఆహ్లాదంగా సాగింది. అతిథులుగా హాజరైన గురువులు పీటీ రామకృష్ణ, బోయనపల్లె కృష్ణమోహన్, తిమ్మారెడ్డి, చెరుకులపాడు వరప్రసాద్, బొమ్మన సుబ్బారెడ్డి, శంకరయ్యలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. రిటైర్డ్ తెలుగు మాస్టారు శంకరయ్య చేతుల మీదుగా గురువుల ఫొటోలతో కూడిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన 80 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయసు దాకా ఉన్న హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఒకేచోట చేరి ఆనందాలు పంచుకున్నారు. సంఘం ప్రతినిధులు స్థానిక బాలుర, బాలికల హైస్కూల్‌లలో చేసిన సేవా కార్యక్రమాలు వివరించారు. అతిథులు మాట్లాడుతూ ఆరోగ్యం బాగా చూసుకోవాలని, నిజాయితీ, నైతిక విలువలతో సన్మార్గంలో నడవాలన్నారు. బాలికల హైస్కూల్ హెచ్‌ఎం విజయకుమారి, ఉపాధ్యాయినులు, సంఘం ప్రతినిధులు రవి, లక్ష్మణ్, అగస్టీన్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దికెర: మిత్రమా.. కుశలమా? అంటూ 1983-84 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు తిరిగి కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 39 ఏళ్ల తరువాత తిరిగి కలుసుకున్న పాఠశాల పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆహ్లాదంగా గడిపారు. అనంతరం ఒకరినొకరు పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యనేర్పిన గురువులు గోపాలకృష్ణ, నాగేశ్వరరావు, రాఘవశర్మ తదితరులను శాలువాలతో కప్పి ఘనంగా సన్మానం చేశారు. పూర్వ విద్యార్థులు ఆర్‌టీసీ మల్లికార్జున, రామకృష్ణ, హరి, ముద్దు రంగయ్య పాల్గొన్నారు.

నేడు నందవరానికి ఎమ్మెల్యే రాక

నందవరం: మండల కేంద్రంలో సోమవారం నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి రానున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక సచివాలయం-1 ఆవరణలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.